సాక్షి తిరుపతి

గురువారం ၊ 26 ၊ అక్టోబర్ ၊ 2023



కల్యాణం.. కమనీయం

రాపూరులో బుధవారం పెనుశిల లక్ష్మీనృసింహస్వామి, ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీదేవి కల్యాణం నిర్వహించారు.

- 8లో



విజిబుల్ పోలీసింగ్

నేర నియంత్రణకే విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యమిస్తున్నట్లు ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు.

- 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	36	23
చిత్తూరు	34	22
తిరుమల	31	17
గూడూరు	36	24
నగరి	36	23

న్యూస్‌రీల్

గిరిజన విద్యార్థులకు మెరుగైన 'వసతి'



సూర్యనారాయణ, గిరిజన సంక్షేమాధికారి

తిరుపతి అర్బన్ : గిరిజన వసతి గృహాల్లోని పిల్లలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారిత అధికారి బి.సూర్యనారాయణ వెల్లడించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నట్లు తెలిపారు. వసతి గృహాల పరిసరాలను నిత్యం శుభ్రంగా ఉంచడంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు చెప్పారు. జిల్లాలోని మొత్తం 6 గిరిజన హాస్టళ్లలో 420 మంది విద్యార్థులు ఉన్నట్లు వివరించారు. వారి బాగోగులను ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు.

దేవదాయశాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారిగా మల్లికార్జున్‌రెడ్డి



తిరుపతి అర్బన్ : దేవదాయశాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారిగా మల్లికార్జున్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న పుట్టా రామకృష్ణారెడ్డి వచ్చే ఏడాది జనవరి 20వ తేదీ వరకు సెలవుపై వెళ్లడంతో సత్యసాయి జిల్లాలో పనిచేస్తున్న మల్లికార్జునరెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఎస్వీయూలో జాబ్‌మేళా రేపు

తిరుపతి సిటీ : ఎస్వీయూ ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ టి.శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మేళాకు మూడు ఎమ్మెన్సీ కంపెనీల ప్రతినిధులు హాజరై సుమారు వంద ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఎంబీఏ ఉత్తీర్ణులైన వారు ఉదయం 10గంటలకు హాజరుకావాలని సూచించారు.

జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు దీత్య చందిక



సూళ్లూరుపేట రూరల్ : పట్టణంలోని డేగల పాళానికి చెందిన యు.దీత్య చందిక (12) జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికైంది. స్థానికంగా ఓ ప్రైవేట్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న చందిక వైఎస్సార్ జిల్లా వేంపల్లెలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ద్వితీయస్థానం దక్కించుకుంది. ఈ క్రమంలో నవంబర్ 15 నుంచి 22 వరకు ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్‌లో జరగనున్న జాతీయ స్థాయి ఆర్చరీ పోటీల్లో పాల్గొననున్నట్లు కోచ్ హారతి వెల్లడించారు.

డిజిటల్ చెల్లింపులపై శిక్షణ

చిత్తూరు కార్పొరేషన్: పల్లెల్లో పన్నుల వసూళ్లకు అమలు చేయనున్న డిజిటల్ చెల్లింపులపై గురు, శుక్రవారాల్లో పంచాయతీ కార్యదర్శులకు డీపీఓ కార్యాలయంలో శిక్షణ ఇవ్వనున్నట్లు డీపీఓ లక్ష్మి తెలిపారు. మూడు వేల మంది జనాభా గల పంచాయతీల్లో పీఓఎస్ మిషన్ల ద్వారా, 3 వేల మందికన్నా తక్కువ జనాభా గల చోట క్యూఆర్ కోడ్ ద్వారా పన్నులు వసూలు చేయనున్నట్లు తెలిపారు.

వెజిట్రబుల్స్



పురుగు పట్టడంతో దెబ్బతింటున్న బెండ





జిల్లాలో కూరగాయల సాగుపై వేలాది మంది రైతులు ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ప్రజలకు నాణ్యమైన ఉత్పత్తులను అందించేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారు. చిరువ్యాపారులు సైతం వెజిటబుల్ విక్రయాలతో తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఈ క్రమంలోనే పంటలను ఆశించే చీడపీడలతో అన్నదాతలు నానా అవస్థలు పడుతున్నారు. వాతావరణం అనుకూలించక.. గిట్టుబాటు ధర దక్కక నష్టాలు ఎదుర్కొంటున్నారు. అయితే వ్యవసాయాధికారులు ఎప్పటికప్పుడు కూరగాయల సాగుకు సహకారం అందిస్తున్నారు. తెగుళ్ల నివారణకు అమూల్యమైన సలహాలు అందిస్తున్నారు. రైతులను ఆదాయ మార్గంలో నడిపించేందుకు తమ వంతు బాధ్యతను చిత్తశుద్ధితో నెరవేరుస్తున్నారు.

- జిల్లావ్యాప్తంగా సుమారు 6వేల ఎకరాల్లో కూరగాయ పంటలు
- చీడపీడలతో ఉక్కిరిబిక్కిరవుతున్న రైతులు
- నివారణకు చిన్నపాటి జాగ్రత్తలు తప్పవంటున్న వ్యవసాయాధికారులు
- అప్రమత్తంగా ఉంటే గిట్టుబాటు ధర పొందవచ్చని సూచనలు

తిరుపతి అర్బన్ : జిల్లాలో సుమారు 92శాతం కుటుంబాలు వ్యవసాయం, వాటి అనుబంధ రంగాలతో బతుకు బండి నడిస్తున్నాయి. అందులో కూరగాయల పంటలతోనే సుమారు 4,750 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలను అందించడమే లక్ష్యంగా పంటల సాగును కొనసాగిస్తున్నాయి. తద్వారా చిన్నాచితకా వ్యాపారులు సైతం సొమ్ము చేసుకునే వెసులుబాటు కల్పిస్తున్నాయి. అయితే పంటలకు తరచూ చీడపీడలు సోకడంతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాయి. తెగుళ్ల నివారణపై అధికారుల సూచనలు పాటించేందుకు ముందుకు వస్తున్నాయి.

చీడపీడలు.. నివారణ

వంగ, బెండ తదితర కూరగాయల సాగులో ఎక్కువగా సన్న, చిన్న కారు రైతులు జీవనోపాధి పొందుతున్నారు. ఇందులో చీడపీడల సమస్య వారిని ఆందోళనకు గురిచేస్తోంది. తగు జాగ్రత్తలను తీసుకుంటే చీడపీడలను అదుపు చేయవచ్చని వ్యవసాయాధికారులు వెల్లడిస్తున్నారు.

- వంగ, బెండ తోటలను ప్రస్తుతం అధికంగా అక్షింతల పురుగు (పెంకు పురుగులు), కొమ్మ కాయ తొలుచు పురుగు ఆశిస్తున్నాయి.
- ప్రధానంగా అక్షింతల పురుగు, పిల్ల పురుగులు శరీరంపై వెంట్రుకలు కలిగి, ఆకుల పచ్చదనాన్ని తినేసి, జల్లెడగా మారుస్తాయి.
- తల్లి పెంకు పురుగులు, ఆకులను, పూల మొగ్గలను తింటూ వాటిపై రంధ్రాలు చేస్తాయి.
- ఎదిగే మొక్కలను కొమ్మ తొలిచే పురుగు ఆశించి చివర్లు ఎండిపోయేలా చేస్తున్నాయి.



తెగులు సోకి కుళ్లిపోతున్న వంకాయలు

- కాయలు ఏర్పడే దశ నుంచి ఈ పురుగులు కాయలను పుచ్చులుగా మార్చేసి, అమ్మకానికి పనికిరాకుండా చేసేస్తున్నాయి.
- వీటి నివారణకు వంగ, బెండ పంటలను నాటిన తొలి దశలో మొక్కలపై ఏవైనా అక్షింతల పురుగులు కనిపిస్తే వెంటనే వాటిని ఏరి నాశనం చేయాలి.
- కొమ్మతొలుచు పురుగు ఆశించిన రెమ్మలను ఎప్పటికప్పుడు కింద వరకు తుంచివేయాలి.
- మొక్క కాపునకు వచ్చే ముందు దశలో పురుగుల నివారణకు లీటరు నీటికి 2.5 మిల్లీల క్లోరిపైరిఫాస్, 2.5 మిల్లీల క్వినాల్ ఫాస్, 2 మిల్లీల ప్రొఫెనోఫాస్ లేదా 2 గ్రాముల లార్విన్ మందుల్లో ఒక దానిని 5 మిల్లీ వేప మందుతో కలిపి పిచికారీ చేసుకోవాలి.
- అవసరానికి అనుగుణంగా 7 నుంచి 10 రోజుల వ్యవధిలో, మందు మార్చి మరోసారి పిచికారీ చేసుకోవచ్చు.
- కాపు దశలో పురుగుల నివారణకు, ఇవి ఆశించిన రెమ్మలను, కాయలను, పిందెలను పూర్తిగా తొలగించి నాశనం చేయాలి.
- కాయలు కోసిన తర్వాత, తోటలోని చెట్లు బాగా తడిసేలా లీటరు నీటికి 0.5 గ్రా ఎమామెక్టిన్ బెంజోయేట్, 0.4 మిల్లీల కోరాజిన్, 2 మిల్లీల ప్రొఫినోఫాస్ లేదా 0.4 మిల్లీల స్పైనోసాడ్ మందుల్లో ఒక దానిని 5 మిల్లీల వేప మందుతో కలిపి పిచికారీ చేయాలి.
- అవసరం మేరకు ఒకసారి వాడిన మందును మళ్లీ వినియోగించకుండా 7 నుంచి 10 రోజుల వ్యవధిలో పిచికారీ చేసుకోవాలి.
- అయితే వంగ, బెండ కాయలు కోసేముందు ఎట్టి పరిస్థితులలోనూ మందులు పిచియారీ చేయకూడదు.
- కూరగాయల తోటలో పచ్చ దోమ, తెల్ల దోమ, పేను వంటి రసం పీల్చే పురుగులను గమనిస్తే పై మందులతో పాటు లీటర్ నీటికి 0.5 మిల్లీల ఇమిడాక్లోప్రిడ్ లేదా 2 మిల్లీల రోగార్ మందును కలుపుకొని పిచికారీ చేయాలి.

జిల్లా సమాచారం	
పంట	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
బెండ	500
వంగ	450
టమాట	1,650
బీర	150
సొరకాయలు	150
మునగ	200
ఆకుకూరలు	500
కాకర	150
అరటి	150
పచ్చిమిర్చి	1,500
ఇతర కూరగాయలు	200

తగు జాగ్రత్తలు పాటించాలి



"కూరగాయలు సాగు చేస్తున్న రైతులు తగు జాగ్రత్తలను పాటిస్తే లాభాలు ఆర్జించవచ్చు. ఇది వరకటిలా గుడ్డిగా సాగు చేస్తే చాలదు. నిత్యం పంటలపై నిఘా పెట్టాలి. అప్పుడే మంచి దిగుబడితోపాటు నాణ్యమైన కూరగాయలను పండించే వీలుంటుంది. దాంతో గిట్టుబాటు ధర దక్కుతుంది. మందుల పిచికారీలో చిన్నపాటి చిట్కాలు పాటిస్తే మేలు.

– మెరుగు భాస్కరయ్య , ఏడీఏ, జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం, తిరుపతి

ఆర్టీసీకి బ్రహ్మోత్సవ రాబడి రూ.16.48 కోట్లు



చెంగల్‌రెడ్డి, జిల్లా ప్రజా రవాణా అధికారి

తిరుపతి అర్బన్: తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల సమయంలో ఆర్టీసీకి మొత్తం రూ.16.48 కోట్ల రాబడి వచ్చినట్లు జిల్లా ప్రజారవాణా అధికారి చెంగల్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్‌లో నిర్వహించిన శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు 9 రోజులపాటు బస్సు సర్వీసులు నడిపినందుకు రూ.8.22 కోట్లు వచ్చాయని, అక్టోబర్లో శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు రూ.8.26 కోట్ల రాబడి వచ్చిందని వివరించారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు ఉత్తమ సేవలందించిన ఆర్టీసీ సిబ్బంది, విశ్రాంత ఉద్యోగులు, ఎంప్లాయిస్ సంఘాల నేతలకు అభినందనలు తెలిపారు. అలాగే ఈ నెల 28, 29 తేదీల్లో పౌర్ణమి సందర్భంగా తిరువణ్ణామలైకు 86 బస్సు సర్వీసులు నడపనున్నట్లు వెల్లడించారు. తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌తోపాటు వెంకటగిరి, వాకాడు, సూళ్లూరుపేట, సత్యవేడు, పుత్తూరు డిపోల నుంచి బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే అమరావతి, గరుడ, ఇంద్ర ఏసీ సర్వీసులు రెండు చొప్పున నడపనున్నట్లు వివరించారు. ప్రయాణికులు తమ టికెట్లను రిజర్వేషన్ చేసుకునే సౌకర్యం కల్పించామన్నారు. ఇతర వివరాలకు 9959225684,9959225686 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

బ్యాడ్మింటన్ క్రీడాకారుడికి అభినందన



ప్రథమస్థానంలో నిలిచిన షేక్ గౌస్, పూజా

గూడూరురూరల్ : జాతీయస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన గూడూరుకు చెందిన క్రీడాకారుడు షేక్ గౌస్‌కు బుధవారం పలువురు అభినందనలు తెలిపారు. ది యంగ్ గూడూరు షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ వారు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. వారు మాట్లాడుతూ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంగా గౌస్, పూజా దండు సత్తా చాటి బంగారు పతకం గెలుచుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఏపీ జట్టు తరపున పోటీల్లో పాల్గొని తెలంగాణకు చెందిన బొక్కా నవనీత్, కె.మనీషాపై రెండు వరుస సెట్లు కై వసం చేసుకుని విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్ : రోడ్డు ప్రమాదాల నివారణకు చిత్తశుద్ధితో కృషి చేయాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో రహదారి భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గత ఏడాది కంటే ఈ సంవత్సరం జిల్లావ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు తగ్గాయని, అయితే మరణాల సంఖ్య మాత్రం తగ్గలేదన్నారు. ఈ క్రమంలో జిల్లాలో గుర్తించిన ప్రమాదకర మలుపుల వద్ద తగు చర్యలు చేపట్టాలని సూచించారు. భద్రతా నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రమాదం జరిగిన వెంటనే గోల్డెన్ అవర్ (గంటలోపు)లో క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించిన వారికి వెంటనే రూ.5వేల ప్రోత్సాహకం చెల్లించాలని స్పష్టం చేశారు. తిరుమల ఘాట్‌లో రాకపోకలకు నిర్ణీత సమయ నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని చెప్పారు. తిరుపతిలో నూతనంగా ప్రారంభించిన శ్రీనివాససేతుపై రాంగ్‌రూట్‌లో వస్తున్న వాహనదారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఐఐటీ సహకారంతో సిగ్నల్ ఫ్రీ జంక్షన్ ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం రోడ్డు భద్రతపై అవగహన పోస్టర్లు , కరపత్రాలు, బుక్‌లెట్లను ఆవిష్కరించారు. సమావేశంలో రోడ్డు భద్రతా కమిటీ జిల్లా కన్వీనర్, రవాణా శాఖ అధికారి సీతారామిరెడ్డి , రాష్ట్ర రోడ్డు భద్రతా కమిటీ సభ్యుడు సునీల్ చక్రవర్తి , ట్రాఫిక్ డీఎస్పీ నరసప్ప, ఆర్అండ్‌డీ ఈఈ శ్రీనివాసులు, ఎస్‌హెచ్ డీఈ నాగరాజు, కార్పొరేషన్ ఎస్ఈ మోహన్, టీపీఓ మధుసూదన్ , డీఎంహెచ్ఓ శ్రీహరి, డీసీహెచ్ఎస్ ఆనంద్, డీపీఎం శ్రీనివాసరావు, ఎన్ఐసీ ప్రసాద్, ఎస్వీఆర్ఆర్ సూపరింటెండెంట్ రవి ప్రభు పాల్గొన్నారు.

సరిహద్దుల్లో పకడ్బందీ నిఘా

రాష్ట్ర సరిహద్దుల్లోని చెక్ పోస్ట్‌ల్లో పకడ్బందీగా నిఘా పెట్టాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బెల్ట్ షాపుల నియంత్రణ, ఇతర రాష్ట్రాల నుంచి మద్యం రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మద్యం అమ్మకాల నగదును ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి చెల్లింపులు చేయాలని సూచించారు. వైన్‌షాపు సిబ్బంది మద్యం ధరల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే ఎప్పటికప్పుడు స్టాక్ వెరిఫికేషన్ చేపట్టాలని కోరారు. సమావేశంలో జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారి రాజేంద్ర , ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానకీరామ్, ఏఈఎస్‌లు రమేష్ , నాగరాజారెడ్డి పాల్గొన్నారు.

సేవే లక్ష్యంగా స్విమ్స్

తిరుపతి సిటీ : ఆధ్యాత్మిక క్షేత్రం తిరుపతిలో రోగుల సేవే లక్ష్యంగా స్విమ్స్ ఆస్పత్రి పనిచేస్తోందని స్విమ్స్ వైస్ చాన్సలర్ కమ్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వీ కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి, ఈఓ ఏవీ ధర్మారెడ్డి, జేఈఓ సదాభార్గవి సహకారంతో ఆస్పత్రి అభివృద్ధికి వినూత్న సంస్కరణలు అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలకు అత్యున్నత వైద్యం అందించేందుకు చిత్తశుద్ధితో విధులు నిర్వర్తిస్తున్నామని వివరించారు. ఈ క్రమంలో స్విమ్స్ అభివృద్ధి, రోగులకు కల్పించే వసతులు, ప్రవేశపెట్టనున్న కొత్త పద్ధతులపై ఆయన ప్రత్యేకంగా 'సాక్షి'తో మాట్లాడుతూ ఏమన్నారంటే..

- పింక్ బస్‌లతో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు
- పడకల కొరత నివారణకు పకడ్బందీ చర్యలు
- రోగుల సహకారానికి మూడు కమిటీలు
- ఖాళీ పోస్టుల భర్తీకి త్వరలో నోటిఫికేషన్
- స్విమ్స్ వీసీ, డైరెక్టర్ ఆర్‌వీ కుమార్



స్విమ్స్ వీసీ, డైరెక్టర్ ఆర్‌వీ కుమార్

- ఆస్పత్రిలో రోగులకు పడకల కొరత రాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాం. ఏ సమయంలో వచ్చినా ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశాం. అత్యవసరం కోసం ప్రత్యేకంగా 4 బెడ్లు నిత్యం అందుబాటులో ఉంటాయి. ఎమర్జెన్సీ , క్యాజువాలిటీ విభాగాలను ఆధునికీకరించాం. ప్రతి విభాగంలో 24గంటలూ డాక్టర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నాం. రోగి ఏ సమయంలో వచ్చినా వెంటనే అడ్మిట్ చేసుకునేలా ఆదేశాలు జారీ చేశాం. కోవిడ్ తదనంతర పరిణామాల నేపథ్యంలో హఠాన్మరణాలు తగ్గించేందుకు కమ్యూనిటీ మెడిసిన్ ఆధ్వర్యంలో జాగ్రత్తలు చేపట్టాం.
- నవంబర్ 1వ తేదీ నుంచి పదిలం..పదిలం..పసి హృదయం పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించనున్నాం. ఇందుకోసం రోగులు ముందుగా స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. పరీక్షలు నిర్వహించిన తర్వాత వ్యాధి తీవ్రత మేరకు చికిత్స అందిస్తాం.
- స్విమ్స్ పరిధిలో బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి భవనాన్ని నూతనంగా నిర్మిస్తున్నాం. ప్రస్తుతం పనులు చివరి దశకు చేరుకున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా డిసెంబర్‌లో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. 14 రకాల క్యాన్సర్లకు సంబంధించిన సేవలతో సుమారు 400 పడకల సామర్థ్యం కలిగిన ఈ ఆస్పత్రి రాష్ట్రవ్యాప్తంగా రోగులకు సేవలందిస్తుంది.
- గ్రామీణ ప్రజలకు మూడు పింక్ బస్‌లతో వైద్యసేవలందిస్తున్నాం. డాక్టర్లు గ్రామీణ ప్రాంతాలలో పర్యటించి మహిళలతోపాటు పురుషులకు సైతం క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. రూ.10వేల విలువైన పరీక్షలను ఉచితంగా చేస్తున్నారు. త్వరలోనే పింక్ బస్సుల సేవలను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించనున్నాం. పరీక్షల అనంతరం రోగులకు స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తాం.
- స్విమ్స్‌లో ఖాళీ పోస్టుల భర్తీకి త్వరలోనే నోటిఫికేషన్ జారీ చేస్తాం. 100 మంది వైద్యులు, 300 మంది నర్సులను తీసుకుంటాం. వైద్యసిబ్బంది కొరత లేకుండా పక్కాగా చర్యలు చేపడుతున్నాం. అవసరాల మేరకు విదేశీ వైద్యులతో కలిసి పనిచేసేందుకు ప్రయత్నిస్తున్నాం.
- ఆస్పత్రిలో పారిశుద్ధ్యం, సెక్యూరిటీ, పార్కింగ్ విషయంలో ప్రత్యేక మార్పులు చేపట్టాం. రోగులు వారి సహాయకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నాం.
- పేషెంట్ ఫ్రెండ్లీగా స్విమ్స్‌ను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం. టీటీడీ చొరవతో రోగులకు విశేష సేవలందించేందుకు ప్రత్యేకంగా మూడు కమిటీలు ఏర్పాటు చేశాం.
- **స్విమ్స్ ఈఎండీ విజిలెన్స్ కమిటీ** : ఇందులో సర్జికల్ అంకాలజీ హెడ్ ప్రొఫెసర్ నరేంద్ర ఆధ్వర్యంలో బర్డ్ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ రెడ్డెప్పరెడ్డి, స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.రామ్, ఆర్ఎంఓ కోటిరెడ్డి, ఎస్ఎమ్ఓలు డాక్టర్ శివశంకర్, డాక్టర్ మునుస్వామి, నర్సింగ్ డీడీ ప్రభావతి, సెక్యూరిటీ ఆఫీసర్ ప్రకాశ్ సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ రోగుల అడ్మిషన్లు, చికిత్స, ఎమర్జెన్సీ కేసుల వివరాలపై ప్రత్యేక నిఘా పెట్టి ఎప్పటికప్పుడు నివేదిక సిద్ధం చేస్తుంది.
- **అవుట్ పేషెంట్ ఇన్ పేషెంట్ క్విక్ రియాక్షన్ కమిటీ** : ఇందులో పీడియాట్రిక్ సూపరింటెండెంట్ రామ్ ఆధ్వర్యంలో మెడికల్ రికార్డ్స్ ఆఫీసర్ వివేకానంద్ బృందం పనిచేస్తుంది. వీరు పేషెంట్ల ఇన్ అండ్ అవుట్ వ్యవహారాలను పర్యవేక్షిస్తారు.
- **టీటీడీ మిత్ర కమిటీ** : ఇందులో ఆర్ఎమ్ఓ డాక్టర్ కోటిరెడ్డి ఆధ్వర్యంలో నర్సింగ్ సూపరింటెండెంట్ సునీత, మురళి, ప్రసాద్ సభ్యులుగా ఉంటారు. వీరు టీటీడీ ఉద్యోగుల అడ్మిషన్లు, ఫిర్యాదులు, గ్రీవెన్స్‌ను పర్యవేక్షిస్తారు.

- స్విమ్స్‌లో విజయవంతంగా ఓపెన్ హార్ట్ సర్జరీలు చేస్తున్నాం. డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటికే సుమారు 30 ఓపెన్ హార్ట్ సర్జరీలు, బైపాస్ సర్జరీలు పూర్తిచేశాం. త్వరలో గుండె, ఊపిరితిత్తులు, కాలేయం, మూత్రపిండాలు, బోన్‌మారో ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆపరేషన్లు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ఆపరేషన్ లేకుండా చేసే వాల్ రిప్లేస్ కోసం అధునాతన యంత్రాలను అందుబాటులోకి తీసుకురానున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా ఉచితంగా గుండె జబ్బుల నిర్ధారణ పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టాం.



శ్రీవారి దర్శనానికి 5 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 71,037 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 20,563 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.2.66 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన వారికి సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని భక్తులకు 5 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన వారికి 2 గంటల్లో దర్శనమవుతోంది.

బాధిత కుటుంబాలకు భరోసా



ప్రభుత్వాస్పత్రి వద్ద బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య

నాయుడుపేటటౌన్ : మండలంలోని బిరదవాడ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలను ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య భరోసా ఇచ్చారు. బుధవారం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రి వద్ద బాధిత కుటుంబాలను పరామర్శించారు. సీఐ నరసింహారావును ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. మార్చురీలోని దామవరపు కార్తీక్, తుమ్మా ఆనంద్‌బాబు, ఆవుల మురళి మృతదేహాలకు నివాళులర్పించారు. త్వరితగతిన పోస్టుమార్టం పూర్తి చేసి మృతదేహాలను వారి కుటుంబీకులకు అప్పగించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రకళ, డాక్టర్ వెంకటరత్నాన్ని ఆదేశించారు. ఈ క్రమంలోనే శ్రీనివాసపురం వద్ద జాతీయ రహదారిపై డివైడర్ తొలగించేందుకు హైవే అధికారులతో మాట్లాడనున్నట్లు వెల్లడించారు. డివైడర్ కారణంగా వాహనదారులు రాంగ్ రూట్‌లో వెళుతూ ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ టి.సుబ్రహ్మణ్యంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ టి.జనార్ధన్‌రెడ్డి, టి.బలరామిరెడ్డి, కె.జయరామయ్య, రాజేష్, రాహుల్, హరి ఉన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

- ఖరీదైన వైద్యం ఆరోగ్యశ్రీతో ఉచితం
- రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా

విజయపురం (నగరి): ఆరోగ్యమే మహాభాగ్యం అనే నానుడిని నిజం చేస్తూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేస్తున్నారని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడల శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. బుధవారం విజయపురం మండలం శ్రీహరిపురం సచివాలయ పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపునకు మంత్రి ఆర్కే రోజా, జిల్లా కలెక్టర్ ఎస్.షణ్మోహన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి ఆర్కే రోజా మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కోసం ఈ దేశంలో ఏ ముఖ్యమంత్రికీ రాని ఆలోచన జగనన్నకు వచ్చిందని, ఇందులో భాగంగా జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌లను నిర్వహిస్తున్నారని చెప్పారు. ప్రజా సంక్షేమం కోసం పరితపించిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తనయుడు తన తండ్రి కంటే ఒక అడుగు ముందుకు వేసి గ్రామస్థాయి నుంచి ప్రతి ఇంటికీ వైద్య సదుపాయాలను అందించేలా జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను నిర్వహిస్తున్నారన్నారు. ఈ క్యాంపుల ద్వారా వైద్యులను ఇంటి వద్దకే పంపి పరీక్షలు చేయించి, చికిత్సలు అందిస్తూ, ఖరీదైన మందులు ఉచితంగా పంపిణీ చేస్తున్నారని చెప్పారు. అలాగే సూపర్ స్పెషాలిటీ వైద్యం అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్యం చేయిస్తున్నారన్నారు. క్యాన్సర్ ఉన్న వారిని గుర్తించి స్విమ్స్ ఆస్పత్రి పర్యవేక్షణలోని పింక్ బస్సు ద్వారా క్యాంప్‌లను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం గత నాలుగున్నరేళ్లలో రూ.8,845 కోట్లతో 1.40 కోట్ల మందికి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యం, ఆరోగ్య ఆసరా ద్వారా రూ.1,004 కోట్ల వ్యయం చేసి 16.19 లక్షల మందికి ఆర్థిక భరోసా అందించారన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద 35 లక్షల మంది చిన్నపిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం నిమిత్తం రూ.6,687 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. కంటి వెలుగు కార్యక్రమం ద్వారా రూ.113 కోట్లు ఖర్చు చేసి కంటి పరీక్షలు నిర్వహించి, శస్త్ర చికిత్సలు, కంటి అద్దాలను పంపిణీ చేశామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అదనంగా 17 మెడికల్ కళాశాలను తీసుకువచ్చారని, అందులో 5 కళాశాలలను ఇటీవల ప్రారంభించారని తెలిపారు. రాష్ట్రంలో పారదర్శక పాలన అందించడంలో భాగంగా చిన్నస్థాయి నుంచి మంత్రి స్థాయి వరకు ప్రజా ప్రతినిధులు ప్రతి ఇంటి తలుపు తట్టి ప్రజల సమస్యలను తెలుసుకుంటూ పరిష్కరించే దిశగా అడుగులు వేస్తున్నారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రోజా



బీపీ పరీక్ష చేయించుకుంటున్న మంత్రి రోజా

గ్రామస్థాయి నుంచి వైద్యం

గ్రామ స్థాయి నుంచి ప్రతి పౌరుడు ఆరోగ్యవంతమైన జీవనం గడపాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని జిల్లా కలెక్టర్ సగిలి షణ్మోహన్ అన్నారు. నవంబర్ 15వ తేదీ వరకు జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ప్రభావతి అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ రాజశేఖర్‌రెడ్డి, నగరి ఆర్డీఓ సుజన, డీఐఓ రవిరాజు, ఎంపీడీఓ చంద్రమౌళి, తహసీల్దార్ వెంకటరాయులు, వైస్ ఎంపీపీ బాలాజీ, సర్పంచ్‌లు కుప్పారెడ్డి, శాంతి, జ్యోతి, సౌదామని తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ఓజిలి: మండలంలోని చిలమానుచేను పాత ఐజీఎం ప్లాంటు వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముంతల పద్మ(35) అనే మహిళ మృతి చెందింది. వివరాలు చిలమానుచేనుకు చెందిన పద్మ గూడూరు ఉపాధి హామీ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తోంది. ఈ క్రమంలో విధులు ముగించుకుని స్కూటీలో ఇంటికి వస్తుండగా అదుపు తప్పి పడిపోయింది. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మరణించింది. సమాచారం అందుకున్న ఎస్‌ఐ ఆదిలక్ష్మి వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడికి గాయాలు

పెళ్లకూరు : మండలంలోని ఎగువచావలి వద్ద విద్యుదాఘాతంతో గోళ్ల సతీష్‌కుమార్ అనే యువకుడు మంగళవారం రాత్రి గాయపడ్డాడు. వివరాలు.. నాయుడుపేట-పూతలపట్టు జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా కొత్తగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. తీగలు తక్కువ ఎత్తులో ఉండడం వల్ల అటుగా వెళుతున్న భారీ వాహనానికి తగిలి తెగిపోయాయి. అదే సమయంలో మేనకూరు సెజ్‌లో పనిచేసే సతీష్‌కుమార్ బైక్‌లో ఇంటికి వెళుతుండగా విద్యుత్ తీగలు తగలడంతో ప్రమాదం జరిగింది. ఎస్‌ఐ శ్రీకాంత్ ఘటనా స్థలానికి చేరుకుని బాధితుడిని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం నెల్లూరుకు తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కమనీయం.. కల్యాణం



వేడుకలో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తదితరులు



దేవదేవేరుల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

రాపూరు : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బుధవారం పెనుశిల శ్రీలక్ష్మీనృసింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మీదేవి కల్యాణం నిర్వహించారు. ధర్మప్రచార వారోత్సవాల్లో భాగంగా వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల్లో దేవదేవేరుల కల్యాణం జరిపించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సంకల్పించారు. ఈ మేరకు తొలుత రాపూరులో స్వామి, అమ్మవార్ల వివాహ వేడుకను కమనీయంగా నిర్వహించారు. శోభాయమానంగా తీర్చిదిద్దిన మండపంలో ఉత్సవర్లను కొలువుదీర్చారు. మంగళ వాయిద్యాలు, వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం జరిపించారు. పెద్దసంఖ్యలో భక్తులు కర్పూర హారతులు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, పార్టీ మండల అధ్యక్షుడు పాపకన్ను దయాకర్‌రెడ్డి, జేసీఎంఎస్ కన్వీనర్ నారాయణరెడ్డి, ఈఓ జనార్ధన్‌రెడ్డి ,పెంచలకోన ఆలయ ప్రధానార్చకులు సీతారామయ్యస్వామి, పెంచలయ్యస్వామి, అర్చకులు శశిస్వామి, మల్లికార్జునస్వామి, వినోద్‌స్వామి,సూర్యస్వామి, నాగరాజస్వామి, ప్రసాద్‌స్వామి పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడా షెడ్యూలు విడుదల

- నేటి నుంచి నవంబర్ 6 వరకు జిల్లాస్థాయి సెలెక్షన్స్

నగరి : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) జిల్లా స్థాయి క్రీడా ఎంపికలకు సంబంధించిన క్రీడల షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వివిధ మైదానాలు వేదికగా గురువారం నుంచి నవంబర్ 6వ తేదీ వరకు అండర్-14, అండర్-17 బాలబాలికల విభాగాల్లో జిల్లాస్థాయి ఎంపికలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సురేష్ తెలిపారు. సెలెక్షన్స్‌కు హాజరయ్యే క్రీడాకారులు స్టడీ సర్టిఫికెట్, చైల్డ్ ఐడీ, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డ్ తదితర సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు.

తేదీ	క్రీడాంశం	వేదిక
26-10-2023	బాల్ బ్యాడ్మింటన్	జెడ్పీహెచ్‌ఎస్ మునగలపాళెం, ఏర్పేడు
	సాఫ్ట్‌బాల్	ఎస్‌ఆర్‌ఎస్‌జీహెచ్, పుత్తూరు
27-10-2023	ఫుట్‌బాల్	జీడీసీ మైదానం, పలమనేరు
	చెస్	ఎస్‌పిజేఎన్‌ఎం హైస్కూలు, తిరుపతి
28-10-2023	టెన్నికాయిట్	జెడ్పీహెచ్‌ఎస్, చిలమాకులపల్లె, ఎస్‌ఆర్‌పురం
	జిమ్నాస్టిక్స్	జెడ్పీహెచ్‌ఎస్, ఏర్పేడు
30-10-2023	బేస్‌బాల్	జెడ్పీహెచ్‌ఎస్, మంగళం ట్రెండ్స్
	వాలీబాల్	జెడ్పీహెచ్‌ఎస్, నెల్లేపల్లి, జీడీ నెల్లూరు.
02-11-2023	క్రికెట్	జీవీఎస్‌సీఎస్ స్టేడియం, వాల్మీకిపురం
	సెపెక్‌తక్రా	జెడ్పీహెచ్‌ఎస్(బాయ్స్) రేణిగుంట
03-11-2023	సాఫ్ట్‌బాల్	జెడ్పీహెచ్‌ఎస్, పూతలపట్టు
03-11-2023	మోడర్న్ పెంటాథలాన్	శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్, తిరుపతి
03-11-2023	రోప్ స్కిప్పింగ్	జెడ్పీహెచ్‌ఎస్, మదనపల్లె
04-11-2023	అథ్లెటిక్స్	తుమ్మలగుంట స్టేడియం, తిరుపతి
06-11-2023	రగ్బీ	జెడ్పీహెచ్‌ఎస్, బీఎన్ కండ్రిగ

నేర నియంత్రణకే విజిబుల్ పోలీసింగ్

రేణిగుంట : నేర నియంత్రణకే విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యమిస్తున్నట్లు ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరును సమీక్షించి, జనరల్, కేసు డైరీలు తదితర రికార్డులను పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ తిరుపతికి మహద్వారం వంటి రేణిగుంటలో అప్రమత్తంగా ఉండాలన్నారు. స్థానిక బొంతాలమ్మ గుడి, రమణవిలాస్ కూడళ్లపై నిరంతర నిఘా ఉంచాలని, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఆకస్మికంగా వాహనాల తనిఖీ చేపట్టి ఎర్రచందనం, మాదకద్రవ్యాల అక్రమ రవాణకు చెక్ పెట్టాలని సూచించారు. పాత నేరాగాళ్ల కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని కోరారు. స్టేషన్ వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని స్పష్టం చేశారు. ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా పోలీసు వ్యవస్థ ఔన్నత్యాన్ని పెంచేలా వ్యవహరించాలని తెలిపారు. మహిళా సంరక్షణ కార్యదర్శుల పనితీరును సమీక్షించాలని చెప్పారు. ఈవ్‌టీజింగ్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పోక్సో చట్టంపై బాలికలకు అవగాహన కల్పించాలని సూచించారు. పెండింగ్ కేసులు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని డీఎస్పీ భవ్యకిషోర్‌ను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు నివారణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు యాంటీ డ్రగ్ స్పెషల్ డ్రైవ్‌ను పకడ్బందీగా నిర్వహించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐలు చంద్రశేఖర్ పిళ్లై, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



డీఎస్పీ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

రెండు జేసీబీలు.. ఒక టిప్పర్ సీజ్



అక్రమంగా తవ్విన ఖనిజాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాసకుమార్

సైదాపురం : మండలంలోని గద్దలదిప్ప వద్ద బుధవారం అక్రమంగా తవ్వకాలు చేస్తున్న రెండు జేసీబీలు, ఒక టిప్పర్‌ను జిల్లా మైనింగ్‌శాఖ అధికారి శ్రీనివాసకుమార్ సీజ్ చేశారు. ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా తవ్వకాలు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ క్రమంలో ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా దాడులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మండలంలోని పెరుమాళ్లపాడు, అనంతమడుగు, లింగసముద్రం, తొకలపూడి, తిప్పిరెడ్డిపల్లె, చాగణం, రాజుపాళెం గ్రామాల వద్ద కూడా అక్రమ తవ్వకాలు సాగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని వివరించారు. ప్రభుత్వం అనుమతి పొందిన లీజుదారులు మాత్రమే మైనింగ్ చేయాలని స్పష్టం చేశారు. అనంతరం లింగసముద్రం గ్రామానికి వెళ్లే మార్గంలో అక్రమ తవ్వకాలు చేసిన ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు.

వాహనం ఢీకొని జింక మృతి



జింక కళేబరం

చిల్లకూరు : జాతీయ రహదారిపై బుధవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని జింక మృతి చెందింది. ఏఎస్‌ఐ ప్రభాకర్, కానిస్టేబుల్ చిట్టిబాబు ఘటనాస్థలానికి చేరుకుని అటవీ అధికారులకు సమాచారం అందించారు. జింక కళేబరానికి ఫారెస్ట్ అధికారి మురళి అక్కడే పశువైద్యులతో పోస్టుమార్టం చేయించి, చేడిమాల అటవీప్రాంతంలో అంత్యక్రియలు జరిపించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

సైదాపురం : మండల కేంద్రానికి సమీపంలోని కైవల్యానది వంతెన సమీపంలో బుధవారం రాపూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. గేర్ రాడ్ విరిగిపోవడంతో డ్రైవర్ చాకచక్యంగా బస్సు నిలిపేశాడు. దీంతో బస్సులోని సుమారు 50 మంది ప్రయాణికులకు ముప్పు తప్పింది.

వేర్వేరు చోట్ల గంజాయి పట్టివేత



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

గూడూరురూరల్ : సూళ్లూరుపేట, గూడూరు ఎస్‌ఈబీ పరిధిలో వేర్వేరు చోట్ల బుధవారం నిర్వహించిన తనిఖీల్లో రూ.4.80లక్షల విలువైన 24 కేజీల గంజాయి పట్టుబడినట్లు ఏఎస్పీ రాజేంద్ర తెలిపారు. గూడూరు ఎస్‌ఈబీ స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. సూళ్లూరుపేట బస్టాండ్ వద్ద చేపట్టిన తనిఖీల్లో చెన్నై ప్రాంతానికి చెందిన భూపతి, ప్రేమ్‌నాథ్ అనే ఇద్దరి వద్ద 20 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసులో మరో నిందితుడు కార్తీక్ అలియాస్ వెంకటేష్‌ను త్వరలోనే అరెస్ట్ చేయనున్నట్లు చెప్పారు. అలాగే గూడూరు పరిధిలో చేపట్టిన దాడుల్లో గాంధీనగర్‌కు చెందిన కె.వెంకటేష్, రమణమ్మ, లింగారెడ్డిపల్లెకు చెందిన వంశీని అదుపులోకి తీసుకుని 4 కేజీల గంజాయి, పల్సర్ బైక్, రూ.4,500 నగదు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. గంజాయి రవాణాతో సంబంధం ఉన్న ఒంగోలుకు చెందిన కాపా శ్రీనివాసరెడ్డిని కూడా త్వరలోనే అరెస్టు చేస్తామని తెలిపారు. దాడుల్లో పాల్గొన్న ఎస్‌ఈబీ సీఐ సూర్యనారాయణ, ఎస్‌ఐ శేషమ్మ, హెడ్ కానిస్టేబుల్ కిరణ్‌సింగ్, సిబ్బంది పోలయ్య, రమణయ్య, గౌస్‌బాషా, రామ్‌ప్రసాద్, రమేష్, ఆనంద్‌ను అభినందించారు.